# చిరునవ్వు

అంగుళిమాలా! అంగుళిమాలా!

గాలిలో అలలుగా ఆ శబ్దం తేల సాగింది.

మూలమూలలా వ్రాలి చూసింది. సమాధానం రాలేదు.

'సోదరా అంగుళిమాలా' మళ్ళీ సాదరమైన ఆ పిలుపు. ఎద తలుపులు తెరచి రమ్మన్నట్టు.

సమాధానంగా వికటాట్టహాసం.

ఆ అడవి గడగడ లాడింది.

చుట్టుగల కొండల గుండెలలో దడ
మళ్ళీ వికృతమైన నవ్వుతెర
పిడుగుల వడగళ్లు కురిసినట్లు
పిశాచాల నృత్య కేళికి భేరీ మ్రోగించినట్లు.

ఆ నవ్వు సవ్వడి వినబడినంత మేర
ఆ రూపం పొడ కనబడినంత మేర
అడవి స్తంభించింది.

గర్జ. "ఎవరది ? నన్నే ?"

గర్జతో మేఘం కదలివచ్చింది. ఆ గర్జలో విలయలయ నవ్వింది. అయితే నెమిళ్ళు పురివిప్పి ఆడలేదు. అసలు వాటి జాడయే లేదు.

"ఎవరు నువ్వు"

దూరాన్నుంచి వస్తూనే ప్రశ్నించాడు వాడు. ప్రశ్నతో పాటు తీక్ష్ణ వీక్షణం కోపం రగిలిన ఆ చూపులో పాపం మండుతోంది.

మండే వాని అక్షి గోళాలపై క్రోధచండిక చండతేజం తాండవిస్తోంది.

ఐరావత మంతటి రూపు
ఆ కొన్న సింగంలా అరుపు
గళాన కరాళ కరాంగుళీ మాల
కరాన కసి లాంటి అసి

ఎదురుగా కాషాయాంబరాల్లో సాధు మూర్తి సాక్షాత్కరించిన క్షమ.

'ఎవరు నువ్వు ?

ఎన్ని వేల గుండెలు నీకు? కొండల్నే గజగజలాడించే గండర గండని ఎదురుగా నిలువడానికి, బెదరక పిలవడానికి, ఎన్ని వేల గుండెలు నీకు ?

నేటితో నీ బ్రతుకు పండింది. నీకు కాలం నిండింది. కుందేలై ఎందుకు వచ్చావిక్కడికి? పులి ఉందని తెలియదా! అభాగ్యుడా! నిన్ను చూస్తే నవ్వు వస్తోంది. ఎన్నడూ లేంది జాలి కలుగుతోంది. నీ స్థితి తలుస్తే నీకెందరు శత్రువులో తెలుస్తోంది. ఈ అడవి నడుమ ఆశ్రమంలో ఓ ఋషి ఉన్నాడని నిన్నెవడో పంపించాడు కదూ! నీ వాలకమే తెలుపుతోందది. నేను ఋషిని కాను. మగధ రాజధాని రాజగృహం నుండేనా నీరాక. 'ఋషిగిరి' నగరి కావలి పైపు - ఆ ప్రక్క చైత్యకగిరి - అదిగో అదివృషగిరి. ఇటు ఈ ప్రక్కన దూరాన

వే. నరసింహారెడ్డి

వరాహ, వైహారగిరులు. వాని నడుమ అడవి యిది. తెలిసిందా! ఆ ఋషిగిరి మీద ఉన్నారేమో ఋషులు.

ఇక్కడ కాదు.

"సోదరా! నీ వంగుళిమాలుడవు కాదా?"

'మూర్ఖుడా తెలిసేనా ఇటు వచ్చింది? ఒళ్ళు తెలియకనా? నేనే అంగుళిమాలుణ్ణి. ఇంకా సంశయం ఎందుకు? తెలియక పోతే విను. నా మెడలో చూడు అంగుళిమాల. దగ్గరగా వచ్చిచూడు. మరీ కనులు విచ్చిచూడు. జన పథంలో ప్రజలు, నిర్జన పథంలో పశుపక్షులు ఎవరిపేరు చెబితే అసువు లరచేతనిడి పరుగులు తీస్తారో - ఆ నేనే తెలియదా?

ఈ ఊరికి ఈ దారికి క్రొత్తవాడవా ఏమి?

ఈ మాలలోని ఒక్కొక్క అంగుళి నడుగు ఓ గాథ చెబుతుంది.

నా చేతి పౌరుషం ఎంతో - ఈచేతి వ్రేళ్ళ నోళ్ళే వేనోళ్ళ చాటుతాయి. ఇదిగో ఈ వ్రేలు చూడు. ఇప్పుడిది వట్టి ఎముకేకాని ఓనాడెలా ఉండేదని. ముద్దబంతిలాంటి కన్నెది— వన్నె మాయని మేని ఛాయది. ఓనాడీడకే వచ్చింది మునిమాపువేళ. ఎందుకు వచ్చిందో తెలియదు. అచ్చంగా లేడిలా చూస్తే ఎంతగా నచ్చిందని!? జోడించిన రెండు చేతుల్లో—ఒకేసారి విసిరిన వేటుకు ఒకే వేలు తెగేలా వేశాను. అదే యిది. దానికో గడ్డిపోచ ఉంగరం ఉండేది. తోలుతోపాటు రాలిపోయింది.

ఇదిగో ఇది చూశావా? పగలే కదా అని తెన్నున పోతున్న కుటుంబంలో బాలింతరాలి ఒడిలో పడుకొన్న శిశువు. నిద్రలో నోటిలో పెట్టుకున్న అంగుళి ఇది. ఇదేమో పౌరుషంతో పైకి రాబోయిన పురుష పుంగవుని వ్రేలు ఇది. దీని ప్రక్కనే ఉన్నదే ఇది ఒక కోటీశ్వరుడైన కోమటిది. ఇదేమో ఓ కవిది. తన్ను విడిచిపెడితే ఏదో నా మీద రాస్తానన్నాడు.

ఇట్లెన్నని చెప్పను? అనుమానం వదిలిందా? నేను తెలియందెవరికి? చెట్టుకు తెలుసు. - గుట్టకు తెలుసు. రోజూ ఈ దారిన పోయే సూరీనికి తెలుసు. నిత్యం ఓ పుడిసెడు రక్తం వాడి మొహాన పుక్కిలిస్తే కందిన మొహం దాచుకునేందుకు ఆ కొండ చాటుకు వెళ్ళిపోతాడు. అరె! ఇంకా నిలుచునే ఉన్నావే! కాలికి బుద్ధి చెప్పనే లేదే? గాలిలా వెళ్ళ లేదా! కంపించడానికి బదులు అనుకంప చూపుతావెందుకు?"

"సోదరా నువ్వు దుఃఖంలో ఉన్నావని తెలిసే వచ్చాను." అనూహ్యమైన ఆ సమాధానానికి అంగుళిమాలుడు బిగ్గరగా నవ్వాడు. కొండమీంచి రాయి దొర్లించినట్లు - గులకరాళ్ళ గంప గలపరించినట్లు, చుట్టూవున్న చెట్లూ గుట్టలు తనను వెక్కిరిస్తున్నట్లు మళ్ళీ

నవ్వినట్టు తోచింది వానికి. ఎన్నడూ లేంది అలాంటి అనుభూతి. ఇన్నాళ్ళూ తన భావనకే భయపడి ఆ చెట్లూ ఆ గుట్టలు ఒకటి నొకటి హెచ్చరించు కొంటున్నట్టుగా అనిపించే దతనికి. ఈ నాడలా లేదు. ఎందుకో తనలో ఏదో కొలదిగా, కొరతగా, కలతగా, నలతగా ఉన్నట్లు తోచింది. మెత్తని కత్తి నోసారి లీలగా వలయంగా త్రిప్పి ఓసారి చుట్టూ చూసి ఎదురుగా చూశాడు బెదరినాడేమోనని. కాలి వ్రేళ్ళ గోళ్ళు మొదలు ముడిచిన కెంజడల దాకా చూశాడు.

అడుగుల చివళ్ళ మెత్తని జవుళ్ళు.

సరసిలో విరిసిన పద్మాల్లా పాదాలు, అడుగుదాకా జీరాడే సుషీమరోచుల కాషాయాంబరం. విశాలమైన ఎద_ అభయం చూపే చేతులు - ఆలింగనం చేసుకోవాలని చూస్తున్నట్లు _ ఆశీర్వదిస్తున్నట్లు_ప్రసన్న సుందర వదనం- అంతకన్న మిన్నగా ఆ కన్నులు. ఆ కన్నుల్లోకి సూదులు గ్రుచ్చినట్లు చూశాడు అంగుళీమాలుడు. తను ఒక్కొ_క్కొ_రి అంగుళులు నరికేముందు తనకేసి చూసిన ఆ కన్నులు స్మరించుకున్నాడు. ఏదో అర్థిస్తూ, ప్రార్థిస్తూ దీనంగా హీనంగా చూసే వాకన్నులు. మరి ఈ కన్నులో ! మళ్ళీచూశాడు.

వర్షించబోయే మేఘంలా ఉన్నవి. ఆ నయనాంతాలలో సుమించిన జాలి తనను లాలన చేస్తున్నట్లు అనుభూతి. వాని ననుసరించియే ఆ పెదవి చివర దరహాసం. తన కత్తికన్న మెత్తగా ఉంది. పెదవిపైనా, కనుతుదలలోను శత కోటి వెన్నెలల వలయాలు.

కనుల చివర హేమంత తుషారం ఉంది. పెదవిచివర వాసంత సమీరం ఉంది. భీష్మగ్రీష్మ మూర్తిలా తాను. సుమ వసంతంలా ప్రభువు.

ప్రభువు ! ఎవడు ప్రభువు ? తన ఆలోచనకు తనకే ఆశ్చర్యం కలిగింది. వికటంగా నవ్వాలని ప్రయత్న పూర్వకంగా నవ్వి అన్నాడు.

"నేను దుఃఖంలో ఉన్నానని ఎవరు చెప్పారు నీకు ? నేను దుఃఖంలో ఉండటమేమిటి? నా వద్దకు వచ్చేందుకు భయానికి భయం కలుగుతుంది. దుఃఖానికి దుఃఖం కలుగుతుంది.

కన్నీళ్ళు కాలువలై పారుతూంటే పులకరించి చిలుకరించు కొన్నాను. నా కత్తికీ, నాకూ రక్తాభిషేకం నిత్యం జరిగే పూజా క్రియ.

విలాపాలు కలగానాలుగా విన్పిస్తవి. నాకు తెలిసింది కసి _ నా అసికి తెలిసింది కసి....

"అవును సోదరా ! కసి అసంతృప్తికి పరిణామరూపం. అసంతృప్తి దుఃఖమే. ఏకాకివైన నువ్వు ఎంత శోకాతురుడవో తెలుసు నాయనా,"

అంగుళిమాలుని ఎదలో కోపం తుఫాను రేగింది. ఆ వీచిన పెనుఝంఝులలో దుఃఖ పరీమళాలు. చింత నిప్పుల్లా మండే కన్నుల్లో కనిపించని- దుఃఖ చింతా పవనాలు _ సమాధానం దొరకని అంగుళీమాలుడు కోపంతో అణువణువు కంపించాడు.

"రా ! నాయనా ! నిన్నోసారి కౌగిలించుకోనీ. నీ కోపం, నీ శోకం అపనయించబడితే ఉపశమింపబడితేనాక్కావలిసిన దేముంది."

"వస్తున్నాను నీ పని పట్టడానికి"

గర్జించబోయిన కంఠం గద్గదపడి జీరపోయింది. లంఘించ బోయిన అడుగులు తడబడ్డాయి.

శూలాల్లాంటిచూపులతో ఎదుటి నయనాల లోతులు చూడాలనుకున్నాడు.

పెదవిపై మృదుహాసం - సుందర చంద్రికాధవళిమ తెలిమల్లెల పరిమళాలు.

కను తుదల చిందిన ఆనంద జల బిందులు. చాచిన బాహూలు చూసేసరికి పరపిన చూపులు విరిగి వంగడమే కాదు - ఎత్తినకత్తికూడ నేల రాలిపోయింది. కన్నుల్లోని మంటలు లోనికి జారి లోని వేదనా స్రవంతి పైకి ఉబికింది. అంతర్దాహంతో సతమతమైనాడు అంగుళిమాలుడు. తెలియకనే మాలను త్రెంచివేశాడు. ఎదలో ఏదో వేదన.

తడబడే అడుగులలో నేల రాలే వేళ ప్రభువు పైకెత్తి కౌగిలించుకున్నాడు.

ఆ స్పర్శలో వానికి చలువ విలువ తెలిసి వచ్చింది.

మంచుశిల కరిగి నీరైనట్లు, ఏదో పరివర్తన.

అమృత సేచనంవలె ఆనందానుభూతి.

వెల్లువలై పారే కన్నీళ్ళు, వేదన ఎద మాలిన్యం తుడిచేయి.

"సోదరా ఈ జగత్తు దుఃఖ సమేతం. జన్మ దుఃఖము, జరా దుఃఖము—వ్యాధి దుఃఖము - చావు దుఃఖము—నొవ్వు దుఃఖము, ఉన్నది పోతే దుఃఖము, అనుకున్నది రాక పోతే దుఃఖము, ప్రియ వియోగం దుఃఖము, అప్రియసంయోగము, దుఃఖము ఈ దుఃఖము పరిణామ రూపాలే క్రోధం, కసి. ఈ దుఃఖానికి మూలం తృష్ణ — తృష్ణా నివారణోపాయం ఉన్నది - అదే అష్టాంగమార్గం— ఆ అష్టాంగమార్గం ఇది నాయనా !...."

ఇలా ఆయననోట చెప్పినాదో లేదో కాని ఆయన ఎదనుండి అంగుళీమాలుడు విన్నాడు.

వాని నయనాంతాలలో ఆనందం, తృప్తి లాస్యమాడేయి.

అప్పుడే వెలిసిన ఓ వెన్నెల కిరణం వాని కన్నుల్లో తళుకు లీనింది. ఆ తళుకుల్లో ప్రభువు రూపం ప్రతిబింబించింది.

ఆ తలపుల్లో కలిసి తనువులో లీనమైంది. ఎదకు ఎదపెట్టి ఆ బోధ విన్న అంగుళీమాలుడు ఆనంద పరవశాన అన్నాడు.

"ప్రభూ నీవు బుద్ధుడివా ?"

సమాధానంగా ప్రభువు చిరునవ్వు.

***